ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 08.10.2024 సమయం 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. కాలం చెల్లిన, పాత వాహనాలను స్వచ్ఛందంగా తొలగించడాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో వెహికల్ ఫ్లీట్ ఆధునికీకరణ విధానాన్ని అమలు చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

2. ఇటీవల నిర్వహించిన డీఎస్సీ-2024 పరీక్షలో ఎంపికైన 11 వేల మందికి పైగా అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు హైదరాబాద్ లో నియామక పత్రాలను అందజేస్తారు.

3. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు న్యూఢిల్లీలో 2022 సంవత్సరానికి గాను 70వ జాతీయ చలనచిత్ర అవార్డులను ప్రదానం చేశారు.

4. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించి అధికారులు విద్యుత్ ను సక్రమంగా సరఫరా చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు.

**VFMP:**

కాలం చెల్లిన, పాత వాహనాలను స్వచ్ఛందంగా తొలగించడాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో వెహికల్ ఫ్లీట్ ఆధునికీకరణ విధానాన్ని అమలు చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ కొత్త విధానంలో రిజిస్టర్డ్ వెహికల్ స్క్రాపింగ్ ఫెసిలిటీస్ RVSF, ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లు ATS లు ఏర్పాటు చేయడానికి నిబంధనలను రూపొందిస్తారు. ఈ సౌకర్యాలతో - పర్యావరణపరంగా సురక్షితమైన పద్ధతులలో, పారదర్శకంగా స్క్రాపింగ్, వాహనాల స్థితిని పరీక్షిస్తారు. స్క్రాపింగ్ ప్రక్రియను శాస్త్రీయంగా నిర్వహించడానికి, అతి పాతవైన వాహనాలను మార్చేందుకు RVSFలు,

ATS లను వినియోగించడానికి సమగ్రమైన ఏర్పాట్లు చేశారు. మోటారు వాహన పన్ను రాయితీ కింద వారి పాత వాహనాలను స్వచ్ఛందంగా స్క్రాప్ చేసి, అదే వర్గానికి చెందిన కొత్త వాహనాన్ని కొనుగోలు చేసే వాహన యజమానులు డిపాజిట్ సర్టిఫికేట్‌ను సమర్పించిన తర్వాత మోటారు వాహన పన్నుపై రాయితీని పొందుతారు. 15 ఏళ్లు పూర్తయిన వాహనాలు ఉన్న ప్రైవేట్ వాహన యజమానులు తమ వాహనాలను స్క్రాపింగ్ కోసం రిజిస్ట్రేషన్ చేసి, వచ్చే రెండేళ్లలోపు కొత్త వాహనాన్ని కొనుగోలు చేస్తే జీవిత పన్ను తగ్గింపుకు అర్హులవుతారని రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి తెలిపారు.

**DSC:**

ఇటీవల నిర్వహించిన డిఎస్సీ పరీక్షలో అర్హత సాధించిన 11 వేల 50 మందికి పైగా అభ్యర్థులకు దసరా ఉత్సవాలకు రెండు రోజుల ముందు రాష్ట్ర ప్రభుత్వం రేపు నియామక పత్రాలను అందించనుంది. హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియంలో జరిగే ఒక కార్యక్రమంలో డీఎస్సీ-2024కు ఎంపికైన అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నియామక పత్రాలను అందజేస్తారు. ఎంపికైన అభ్యర్థులను తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను నిన్న విడుదల చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పాఠశాల విద్యాశాఖ అవసరమైన ఏర్పాట్లు చేసింది.

**FILM AWARDS:**

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు న్యూఢిల్లీలో 2022 సంవత్సరానికి 70వ జాతీయ చలనచిత్ర అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్, సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ కూడా పాల్గొన్నారు. 2022 సంవత్సరానికి, మంత్రిత్వ శాఖకు ఫీచర్ ఫిల్మ్ విభాగంలో 32 విభిన్న భాషల్లో మొత్తం 309 సినిమాలు, నాన్-ఫీచర్ విభాగంలో 17 భాషల్లో 128 సినిమాలు వచ్చాయని సమాచార, ప్రసారాల కార్యదర్శి సంజయ్ జాజు తన స్వాగతోపన్యాసంలో తెలిపారు. ఫిల్మ్ క్రిటిక్ - దీపక్

దువాను - ఉత్తమ క్రిటిక్ అవార్డు విభాగంలో స్వర్ణ కమలం అవార్డుతో సత్కరించారు. కిషోర్ కుమార్ పై - ది అల్టిమేట్ బయోగ్రఫీ అనే పుస్తకానికి అనిరుధా భట్టాచార్జీ, పార్థివ్ ధర్ కు - బెస్ట్ బుక్ ఆన్ సినిమా విభాగంలో - స్వర్ణ కమలం లభించింది.

**ATAL PENSION:**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అటల్ పెన్షన్ యోజన కింద ఇప్పటి వరకు 56 లక్షల మంది నమోదు చేసుకోవడంతో స్థూల నమోదులు ఏడు కోట్లను అధిగమించాయని పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ - డెవలప్‌మెంట్ అథారిటీ ఈరోజు ఒక ప్రకటనలో తెలియజేసింది. చందాలు, విరాళాల ఆధారంగా సామాజిక భద్రతా పథకం కింద నెలకు వెయ్యి నుండి ఐదు వేల రూపాయల వరకు కనీస పెన్షన్‌ను అందిస్తారు. భారతీయులందరికీ, ముఖ్యంగా అసంఘటిత రంగంలోని కార్మికులకు సార్వత్రిక సామాజిక భద్రతా వ్యవస్థను రూపొందించే లక్ష్యంతో 2015 లో ఈ పథకాన్ని ప్రారంభించారు.

**NAGARJUNA:**

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖపై దాఖలైన పరువు నష్టం కేసుకు సంబంధించి టాలీవుడ్ నటుడు నాగార్జున వాంగ్మూలాన్ని నాంపల్లి కోర్టు ఈరోజు నమోదు చేసింది. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన కోర్టు నటుడి వాంగ్మూలాన్ని నమోదు చేసింది. ఈ కేసులో సుప్రియ - సాక్షి వాంగ్మూలాన్ని కూడా కోర్టు స్వీకరించింది. అనంతరం కేసు విచారణను కోర్టు రేపటికి వాయిదా వేసింది. సమాజంలో గుర్తింపు ఉన్న తన కుటుంబంపై మంత్రి పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేశారని నటుడు నాగార్జున కోర్టుకు తెలిపారు. తన కుమారుడి విడాకులపై మంత్రి - మీడియా ముందు బహిరంగంగా ప్రకటనలు చేశారని కూడా ఆయన ఆరోపించారు. మంత్రి సురేఖా పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోర్టును ఆశ్రయించారు.

జగదీశ్వర్ రెడ్డి

హైద్రాబాద్ నగరంలో హైడ్రా కూల్చివేతల కారణంగా లక్ష కోట్ల రూపాయలకు పైగా ప్రజాధనం వృథా అవుతుందని మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ... మూసీ సుందరీకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని వృథా చేస్తుందన్నారు. అసలు మూసీ సుందరీకరణపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళిక ఏమిటో చెప్పాలని జగదీశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వం వద్ద మూసీపై డీపీఆర్ ఉందా అని ప్రశ్నించారు. హైదరాబాద్ లోని చెరువులు, మూసీ పరిస్థితులపై చర్చకు సిద్ధమా అంటూ కాంగ్రెస్ కు సవాల్ విసిరారు.

పెండింగ్ బిల్లులు

ప్రభుత్వం దసరా పండుగ లోపు సర్పంచ్ ల పెండింగ్ బిల్లులు చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం ఐకాస అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ కోరారు. హైదరాబాద్ లో మీడియా సమవేశంలో ఆయన మాట్లాడుతూ... సర్పంచులు వడ్డీలకు తెచ్చి గ్రామాలలో వివిధ అభివృద్ధి పనులు చేసినట్లు తెలపారు. అనేక మంది సర్పంచులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంత మంది సర్పంచులు గతంలో ఆత్మహత్యలు చేసుకొని చనిపోయారని ఆరోపించారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా... పెండింగ్ బిల్లులు చెల్లించకుండా సర్పంచుల మీద కక్ష సాధింపులకు పాల్పడడం సరికాదన్నారు.

భట్టి విక్రమార్క

దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను పునరుద్దరించి అధికారులు విద్యుత్ ను సక్రమంగా సరఫరా చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. ఈరోజు ఖమ్మం, వరంగల్ NPDCL

అధికారులతో భట్టీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత నెలలో వచ్చిన మున్నేరు వరదల కారణంగా చాలా విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని, కొన్నిచోట్ల విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయని - వాటిని అధికారులు వెంటనే పునరుద్ధరించి ప్రజలకు ప్రమాదం లేకుండా చర్యలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యుత్ సిబ్బంది కూడా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు.

**BJP:**

ఈరోజు జరిగిన హర్యానా, జమ్మూ కాశ్మీర్ ఎన్నికల ఫలితాలు - నరేంద్ర మోదీ నాయకత్వంపై విశ్వాసాన్ని చూపుతున్నాయని రాష్ట్ర బిజెపి పేర్కొంది. జమ్మూ కాశ్మీర్ ప్రజలు తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం ద్వారా, ప్రజాస్వామ్య పండుగలో న్యాయబద్ధంగా పాల్గొనడం ద్వారా బుల్లెట్‌పై కాకుండా బ్యాలెట్‌పై విశ్వాసం చూపారని పార్టీ అధికార ప్రతినిధి ఎన్‌వి సుభాష్ ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీకి 29 సీట్లు రావడం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని తెలియజేస్తోందన్నారు. రెండు రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్‌గాంధీ అతి విశ్వాసం పూర్తిగా తిరస్కరణకు గురైందన్నారు.